## క్లుప్తంగా

### తగ్గిన టమాట ధరలు



టమాటాను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

కుప్పం రూరల్: కుప్పం మార్కెట్‌లో బుధవారం టమాట ధరలు తగ్గుముఖం పట్టాయి. పదిహేను రోజులుగా 15 కిలోల టమాట క్రేట్ ధర రూ.1000 పలకగా బుధవారం రూ.300 లకు పడిపోయింది. మార్కెట్‌కు ఎక్కువగా టమాట రావడం, చెన్నై, బెంగళూరు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పట్టినట్లు వ్యాపారులు చెప్పారు. ఈ పర్యాయం టమాట ధరలు బాగా ఉండడంతో కుప్పం మండల రైతులు ఇతర రకాల కూరగాయలు, పూల సాగును పక్కన పెట్టి టమాట సాగు ఎక్కువగా చేశారు. ఈక్రమంలో ధరలు తగ్గుముఖం పడుతుండడంతో రైతుల్లో గుబులు మొదలైంది.

### విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ

సదుం: మండంలోని చింతపర్తివారిపల్లె పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువ చేసే విద్యా సామగ్రిని ప్రవాసాంధ్రురాలు సుమలత(అమెరికా) వితరణ చేశారని ఎంఈఓ శ్రీరాములు తెలిపారు. వీటిని విద్యార్థులకు బుధవారం ఆయన పంపిణీ చేశారు. ప్రతిఏటా విద్యా సామగ్రిని ఆమె వితరణ చేస్తోందని ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు. దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుల్లో రాణించాలని ఎంఈఓ ఆకాంక్షించారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, మోహన్‌రెడ్డి, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

### వాహనాల వేలం

పెద్దపంజాణి: వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను 26వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చిత్తూరు ఏఈఎస్ వారి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

చౌడేపల్లె: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం బోయకొండ ఆర్చి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి జరిమానా విధించారు.

### విద్యార్థులకు ఆటల పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: శిక్ష సప్తాహ్‌లో భాగంగా దొడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో స్థానిక విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ లీలారాణి హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా పలు ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుందరం, హెచ్‌ఎం నేతాజి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలి



క్రీడా పోటీల్లో విద్యార్థులు

పుంగనూరు: విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని హెచ్‌ఎం శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని చంద్రమాకులపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రకరకాల ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు క్రీడలు ఉన్నత భవిష్యత్తుకు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ వారికి నచ్చిన క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు జ్యోతి, వెంకట్రమణారెడ్డి, మంజునాథ్, రఘు, శైలజ పాల్గొన్నారు.

# పలమనేరులో బెయిల్.. మదనపల్లెలో జైలు

- బెయిలొచ్చినా విడుదల మరుసటి రోజే
- నిందితుల కుటుంబీకులకు తప్పని తిప్పలు
- పలమనేరులో జైలు లేకపోవడమే కారణం
- కొత్త జైలు నిర్మాణానికి స్థలం కేటాయింపులో మీనమేషాలు




పలమనేరులో ఆరేళ్ల క్రితం మూతపడ్డ సబ్‌జైలు

పలమనేరు: తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి చెందిన ఓ ముద్దాయికి ఇటీవల పలమనేరు కోర్టులో బెయిల్ మంజూరైంది. బెయిల్ ఆర్డర్ సాయంత్రానికి సిద్ధమైంది. అతని కుటుంబీకులు ఆర్డర్ తీసుకుని మదనపల్లి సబ్‌జైలుకు వెళ్లారు. అయితే సాయంత్రం ఐదు తర్వాత ముద్దాయిని జైలు నుంచి పంపడానికి నిబంధనలు అంగీకరించవని అక్కడి జైలర్ తెలిపాడు. దీంతో బాధిత కుటుంబీకులు మదనపల్లిలో రాత్రి పూట ఉండేందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చింది. గత ఐదేళ్లుగా పలమనేరు కోర్టు పరిధిలోని ముద్దాయిల కుటుంబాలకు ఇలాంటి కష్టాలు తప్పడం లేదు. మదనపల్లె సబ్‌జైల్ నుంచి పలమనేరు, కుప్పం కోర్టులకు వాయిదాలకు ఖైదీలను తీసుకురావడానికి పోలీసులకు సైతం కష్టతరంగా మారింది. వాయిదా సమయానికి ముద్దాయిలను ప్రవేశపెట్టడం వారికి కుదరడం లేదు. దీనికి కారణం పలమనేరులో సబ్‌జైలు లేకపోవడమే. తాజాగా బెయిల్ పొందిన ఉత్తర్వులను మెయిల్ చేస్తున్నా నిందితుల బంధువులకు మాత్రం వ్యయప్రయాసలు తప్పడం లేదు.

**కొండెక్కిన కొత్త సబ్‌జైలు నిర్మాణ పనులు..**

పలమనేరు పట్టణంలో కొత్త సబ్‌జైలు నిర్మాణ పనులు కొండెక్కాయి. బ్రిటీష్ కాలం నాటి ఓ భవనంలో గతంలో ఇక్కడ సబ్‌జైలు సాగింది. ఇందులో 25 నుంచి 30 మంది ఖైదీలను ఉంచేవారు. అది కూడా ఇబ్బందికరంగానే ఉండేది. ఉరుస్తున్న భవనాలు కాలం చెల్లిన పైకప్పుతో ఎక్కడ కూలిపోతుందోనని ఇక్కడున్న ఖైదీలను మదనపల్లె సబ్‌జైలుకు ఐదేళ్ల క్రితం తరలించారు. అప్పట్లోనే కొత్త సబ్‌జైలు నిర్మాణానికి ఆ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. అయితే కొత్తజైలు నిర్మాణానికి అక్కడున్న స్థలం చాలదని వారు ప్రభుత్వ స్థలం కోసం రెవెన్యూ శాఖకు విన్నవించారు. అప్పటినుంచి ఇప్పటిదాకా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో నిధులు అప్పట్లోనే వెనక్కి వెళ్లాయి. దీంతో ఈ పనులు ముందుకు సాగలేదు. కుప్పం నుంచి పలమనేరు దాకా పది మండలాలకు ఇదొక్కటే సబ్‌జైలుగా ఉండేది. ప్రస్తుతం ఖైదీలను కలుసుకోవాలంటే వారి కుటుంబీకులు, బంధువులు వ్యయప్రయాసలకోర్చి ఈ ప్రాంతాల నుంచి మదనపల్లెకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త సబ్‌జైలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మున్సిపల్ కమిషనర్ ఎవరు?




పేర్ల పట్టికలో చివరగా నరసింహప్రసాద్ పేరు

కుప్పంరూరల్: కుప్పం మున్సిపల్ కార్యాలయంలో అడుగుగడుగునా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని జనం బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జనం వివిధ పనుల నిమిత్తం మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చే వారికి కమిషనర్ ఎవరో తెలియక తికమకపడుతున్నారు. కార్యాలయంలోని బోర్డులో ఇంకా 2023 నుంచి నరసింహప్రసాద్ ఉన్నట్లు సూచిక బోర్డులో దర్శనమిస్తోంది. నరసింహప్రసాద్ మారిన తరువాత ముగ్గురు కమిషనర్లు మారినా కార్యాలయం బోర్డులో మాత్రం పేర్లు నమోదు కావడం లేదు. నరసింహప్రసాద్ తరువాత రాధిక, ఆమె తరువాత నాగేశ్వరరావు వచ్చారు. ఆయన తరువాత ప్రస్తుతం శ్రీనివాసరావు విధులు నిర్వహిస్తున్నట్లు ముగ్గురు కమిషనర్లు మారినా మున్సిపాలిటీ బోర్డులో మాత్రం పేర్లు నమోదు కాకపోవడంతో కొత్త వ్యక్తులు కమిషనర్ ఎవరో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

### కిరణ్మయికి డాక్టరేట్



గుడుపల్లె: ద్రవిడ వర్సిటీ గ్రంథాలయ శాఖలోని పరిశోధక విద్యార్థిని కిరణ్మయికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి నాగేశ్వరరావు తెలిపారు. డాక్టర్ అంజయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించారు. కిరణ్మయిని అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

### వాహనాల వేలం రేపు

పుంగనూరు: అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 26న ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నారు. బుధవారం సెబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ వాహనాలను వేలం వేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి, వేలం నిబంధనల మేరకు వేలంపాటలో వాహనాలను కొనుగోలు చేసుకోవచ్చునని సూచించారు. పూర్తి వివరాలకు సెబ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఆడికృత్తికకు సర్వం సిద్ధం



వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

సదుం: స్థానిక గార్గేయ నదీ తీరాన వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆడికృత్తిక ఉత్సవాల నిర్వహణకు సిద్ధం అవుతోందని, ప్రతిఏటా ఆషాఢ మాసంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారని రిటైర్డ్ హెచ్‌ఎం, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి తెలిపారు. 28న ధ్వజారోహణ, 29న భరణి కావిళ్లు, పట్టు వస్త్రాల సమర్పణ, 30న కృత్తిక కావిళ్లు, కల్యాణోత్సవం, అన్నదానం, 31న పుష్ప పల్లకీ ఊరేగింపు, ఆగస్టు 1న ధ్వజావరోహణ కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

### ప్రారంభానికి నోచుకోని బీఎస్ఎన్ఎల్ టవర్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సెల్ టవర్

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం వద్దకు వచ్చే యాత్రికులకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్య లేకుండా ఉండేందుకు నూతనంగా టవర్ ఏర్పాటుచేశారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. సిగ్నల్స్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి త్వరగా టవర్ ప్రారంభించి మెరుగైన సేవలందించాలని భక్తులు కోరుతున్నారు.

## మా స్థలాలు ఇప్పించండి

- దళితుల నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు

చౌడేపల్లె: మా స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. వాటిని రక్షించి మాకు ఇప్పించాలని ఆమినిగుంటకు చెందిన దళితులు నిరసన తెలిపి మొరపెట్టుకొన్న సంఘటన ఆమినిగుంట వద్ద చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు,, ఆమినిగుంటకు చెందిన దళితులు 18 మందికి 1983వ సంవత్సరంలో అప్పట్లో ఇందిరమ్మ పథకం ద్వారా ఒక్కొక్కరికి ఐదు సెంట్ల చొప్పున పట్టాలిచ్చారన్నారు. ఈ స్థలంలో ప్రవేశించిన కొందరు ఇళ్ల నిర్మాణం చేశారు. అయితే మరికొందరు రాజకీయ అండదండలతో తమకు పట్టాలిచ్చిన స్థలాలను ఆక్రమించుకొని వాటిని చదును చేసి మరొకరికి విక్రయించే యత్నం చేస్తున్నారని బాధితులు వెంకటరమణ, ఈశ్వరమ్మ, గుర్రప్ప, మంగమ్మ, వెంకటప్ప తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమకు పట్టాలిచ్చిన స్థలాలను సర్వే నిర్వహించి తమకే చెందేలా చూడాలని నిరసన తెలిపారు.

### సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఉమాపతినాయుడికి సన్మానం

పలమనేరు: జిల్లాలోని మామిడి రైతుల సమస్యల సాధన కోసం తాను కమిటీతో కలసి కృషిచేస్తానని మామిడి రైతుల సంఘ అధ్యక్షుడు ఉమాపతినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పట్టణంలోని పలువురు స్థానిక గ్రంథాలయం వద్ద బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో గోవర్ధన్, గణేశ్, గోవిందు, చిట్టి, సిద్ధారెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో ఏజీఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శాంతిపురం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన మూడవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో ఏజీఆర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ సామ్రాజ్ తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్‌లో విజయ్‌కుమార్ 95 శాతం, శారద 88, బీకాంలో సుమతి 88, శరణ్య 87, లావణ్య 86, బీఎస్సీలో రోజా, వైష్ణవి 79 శాతం మార్కులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిని ప్రిన్సిపల్ నిత్యాసామ్రాజ్ బుధవారం అభినందించారు.

### దాతలకు సన్మానం



దాతలను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పుంగనూరు: కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో వంటగది నిర్మించేందుకు వెంకటరాజనాయుడు, విజయలక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం దాతలను హెచ్‌ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు చెందిన దాతలు హైస్కూల్‌లో వంట గది నిర్మాణానికి విరాళం ఇచ్చారని, ఈ నిధులతో వంటగదిని నిర్మించామన్నారు. దాతలు మాట్లాడుతూ హైస్కూల్ అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, రేణుకదేవి, వేణుగోపాలు, వెంకట్రమణారెడ్డి, ప్రకాష్, రాజశేఖర్, గురవయ్య, సయ్యద్‌బాషా, సైదుల్లా, హసినాబి, నాజ్నీ, హైదర్, హయత్‌బాషా, మహ్మద్‌రఫీ, రహమత్‌బాషా, మోహన్ పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం



శివాలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

పెద్దపంజాణి: మండలంలోని బసకందొడ్డికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శివాలయంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పరిసర గ్రామాలైన బట్టందొడ్డి, దాసార్లపల్లె, రామాపురం, ముత్తుకూరు, కరసనపల్లె, కమ్మినాయనిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి చదువుతున్న వంద మంది విద్యార్థులకు యూనిఫాం, విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేరుశనగలో అంతరపంటలు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

- జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ

గంగవరం: వేరుశనగ పంటలో ప్రతిరైతు అంతర పంటగా కంది, బార్డర్ క్రాప్‌గా జొన్న, లేదా సజ్జ, ఎర పంటగా ఆముదం వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ రైతులకు సూచించారు. బుధవారం దండపల్లి పంచాయతీ కురప్పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మేలైన యాజమాన్య పద్ధతిలో వేరుశనగ పొలంబడి కార్యక్రమానికి పుంగనూరు ఏడీఏ శివకుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. వేరుశనగ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వేరుశనగ కలుపు దశలో ఉన్నందున ఒక ఎకరా వేరుశనగకు 200 కిలోల జిప్సం వేస్తే మంచి దిగుబడి వస్తుందని రైతులకు వివరించారు. ఒకవేళ వేరుశనగ వేయని రైతులు భూమిని బీడుగా వదిలేయకుండా ప్రత్యామ్నాయ పంటగా కందులు లేదా ఉలవ పంట వేసుకోవాలని సూచించారు. ఏఓ హేమలత, సర్పంచ్ బీరుగౌడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో శ్రీవాణి, పద్మావతి విద్యార్థుల ప్రతిభ



దీపిక మౌనిక రూప మాధవి

పలమనేరు: జనవరి 2024లో ఎస్వీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీవాణి, పద్మావతి కళాశాలల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ మార్కులను పొందారని కళాశాలల ప్రిన్సిపాళ్లు క్రిష్ణమూర్తిరెడ్డి, శ్రీవాణి బుధవారం తెలిపారు. బీఎస్సీ ఎంఈసీ గ్రూపులో దీపిక 92శాతం, బీఎస్సీ బీజెడ్‌సీలో మౌనిక 94, బీకాం సీఏలో రూప 94, మాధవి 94, గౌతమి, సుప్రీత 93 శాతం చొప్పున మార్కులను సాధించారని వివరించారు.. దీంతోపాటు 55మంది విద్యార్థుల డిస్టింక్షన్లను సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించింది.

## వైభవంగా కనుమ గంగమ్మ జాతర



అమ్మవారికి దీపాలు చెల్లించి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

- అంగరంగ వైభవంగా శిరస్సు మెరవణి
- జాతరకు పోటెత్తిన జనం

పెద్దపంజాణి: మండలంలోని ఆకులవారిపల్లె, గౌరీనగర్, బేరుపల్లె, దేవిరెడ్డిపల్లె గ్రామాలలో కనుమ గంగజాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజలతో పాటు సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించారు.

**భక్తిశ్రద్ధలతో శిరస్సు మెరవణి**

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి ఆయా గ్రామాలలో మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా సాగింది. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణసంచా, సౌండ్ సిస్టం, లైటింగ్ అందరినీ ఆకట్టుకుంది.

**నేడు జలధితో పరిసమాప్తం**

రెండు రోజుల గంగజాతర గురువారం ఉదయం జలధితో పరిసమాప్తం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో జలధి కార్యక్రమం నిర్వహిస్తారు.

## పాఠశాలలకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2

వి.కోట: బుధవారం నాటికి మండలానికి స్కూల్ యూనిఫాం చేరుతుందని ఎంఈఓ-2 మురుగేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 26 ఉన్నత పాఠశాలలు, 3 యూపీ స్కూల్స్, 104 ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 9,467 మంది విద్యార్థులకుగానూ ఒక్కో విద్యార్థికి మూడు జతలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మండలంలోని 133 పాఠశాలలకు బుధవారం వారి వారి పాఠశాలలకు పంపించేశామని తెలిపారు. అయితే గత ప్రభుత్వంలో పాఠశాలల ప్రారంభం రోజే అందరూ విద్యార్థులకు విద్యా కిట్లతోపాటు, యూనిఫాం కూడా పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం స్కూల్ ప్రారంభమై 40 రోజుల తర్వాత యూనిఫాం పంపిణీకి సిద్ధమైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ పలు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు కూడా అందని పరిస్థితి కూడా నెలకొందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

## వీధి కుక్కల సమస్యపై సమావేశం



కుక్కల సమస్యపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

పలమనేరు: మున్సిపాలిటీలో విచ్చలవిడిగా ఉన్న వీధి కుక్కల సమస్య పరిష్కారం కోసం స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి బుధవారం మున్సిపల్, వెటర్నరీ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాన్ని నిర్వహించారు. సమస్య పరిష్కారం కోసం తొలుత వీధి కుక్కలను సర్వే చేసి వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించే చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి ఓ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఇందులో కమిషనర్ రమణారెడ్డి, హెల్త్‌శాఖ నుంచి జయశంకర్, ఏడీ ఏ.మోహన్, వెటర్నరీ డాక్టర్ ధనుంజయ, పీపీఎస్ నుంచి నరసింహులును నియమించినట్టు మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

## కోలాహలం.. గంగ పూజలు



గంగ పూజలు చేస్తున్న వేదపండితులు

గుడుపల్లె: గుడివంక ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు గంగ పూజ కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. బుధవారం గుడివంక శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పశ్చిమ వాహినిలో పూర్ణకుంభంతో వేదపండితుల ఆధ్వర్యంలో గంగపూజలు నిర్వహించారు. ఆలయం నుంచి వేదపండితులు కలశాలను తీసుకుని గంగ పూజ అనంతరం హరోహరా నామస్మరణం చేసుకుంటూ పశ్చిమ వాహిని మెట్లు ఎక్కి స్వామివారికి పూర్ణకుంభంతో పూజలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఉగ్రహానంలో కలశస్థాపనలు చేసి వేదపండితులతో భక్తి శ్రద్ధలతో హోమాలు నిర్వహించారు.